# కార్యేషు మంత్రి

ఇంటర్వల్‌లో బయటికివెళ్ళి రెండు కూల్‌డ్రింకులు తెస్తున్న రమేష్ తాము కూర్చున్న సీటు వెనకేవున్న ప్రభావతిని చూసి షాక్ తగిలినవాడిలా ఒక క్షణం వుండిపోయాడు. ప్రభావతి సుమతి బెస్ట్‌ఫ్రెండ్. ఇందాకటినించి తనని, జయని చూసే వుంటుంది. ఆమె తనవైపే చూడడం గుర్తించి చకచక వెళ్ళి సీటులో కూర్చుండిపోయాడు.

ముఖంలో గాభరా, చెమటలు, అతని ఉత్సాహం అంతా అరక్షణంలో దిగిపోయింది. జయ తనమీద వాలి మాట్లాడుతూంటే, ఇందాకటి వరకు అతిమధురంగా వినిపించినది ఇప్పుడు....అక్కడనించి ఎలా తప్పించుకోడం అన్నట్టు ముళ్ళమీద కూర్చున్నాడు. ఏదో పాతసినిమా ఎవరూ వుండరు అని వస్తే ఈవిడగారు ఇక్కడ అందులో తన వెనక సీటులో దాపరించాలా. ఇందాకటినించి తమ ఇద్దరి మధ్య జరిగిందంతా గమనించే వుంటుంది. ఇంటికి వెళ్ళాక సుమతితో చెప్పకుండా వుండదు. ఆలోచిస్తే అతనికి గాభరా అన్పించింది. సినిమా చూడలేకపోయాడు.

అఖరికి ఇంకా సినిమా అరగంట వుండగానే తలనొప్పి అని వంకపెట్టి లేచిపోయాడు. జయని వాళ్ళింటి రోడ్డుమీద డ్రాప్‌చేసి ఇల్లు చేరాడు. సుమతి ముఖం చూడాలంటే గిల్టీగా అన్పించింది. గత ఏడెనిమిది నెలలుగా జయతో తిరుగుతున్నా ఏనాడు అన్పించనిది ఈ రోజు ఏదో తప్పు చేసినవాడిలా ముఖం తప్పించుకున్నాడు. ప్రభావతి ఈ రాత్రి ఫోను చెయ్యకపోయినా రేపు తప్పక చేస్తుంది. సుమతి అడిగితే ఏం చెప్పాలి? రాత్రంతా అదే ఆలోచన అయి కంటిమీద కునుకు పట్టలేదు అతనికి.

*　　　*　　　*

మర్నాడు, ఆ మర్నాడు కూడా సుమతి ఏమీ అడగకపోవడం ఆశ్చర్యం అన్పించింది రమేష్‌కి. ప్రభావతి సుమతికి చెప్పలేదా....అంత స్పష్టంగా చూసి కూడా చెప్పకుండా ఎందుకూరుకుంది? సుమతి బాధపడ్తుందని చెప్పలేదేమో. ఆ

ఆలోచన రాగానే అతని టెన్షన్ కాస్త తగ్గింది. ఈ టెన్షన్‌తో గత మూడు రోజులుగా జయ దగ్గరకే వెళ్ళాలనిపించలేదు. సుమతి వారం రోజులయినా ఏ ప్రసక్తి తీసుకురాకపోవడంతో నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడు. ఇక ముందు జాగ్రత్తగా వుండాలని నిర్ణయించుకున్నాడు. సుమతి ఏం అడగలేదు కానీ ఎందుకో కాస్త ముభావంగా వుందనిపించింది. ముఖంలో కాస్త కళ తగ్గిందనిపించింది. ఓ రోజు రాత్రి భోజనం చేస్తూ- "ఏం అలా వున్నావు. ఒంట్లో బాగోలేదా?" అడిగాడు భార్య ముఖం చూస్తూ.

సుమతి తలెత్తి "ఏం లేదే బాగానే వున్నాను" అంది కాస్త నవ్వి

"ఏమో డల్‌గా అనిపిస్తే....అందుకే అడిగాను" అని కాసేపాగి- "ఎక్కడికి వెళ్ళలేదా ఈ మధ్య? మీ ఫ్రెండుకూడా వస్తున్నట్టులేదే...." కాఫీ లాగాడు.

"ఆఁ. ఎందుకు రావడంలేదు. మూడు నాలుగు రోజులక్రితం వచ్చి వెళ్ళింది....ఫోనూ చేస్తుంది" సుమతి భర్త ముఖంలోకి చూసింది. గతుక్కుమన్నాడు రమేష్, వచ్చిందంటే చెప్పకుండా వుంటుందా, చెప్పిందేమో. అందుకే సుమతి కాస్త ముభావంగా వున్నట్టుంది. తగ్గిన టెన్షన్ మళ్ళీ మొదలైంది అతనిలో. భార్య ఇంత ఏం అనకపోవడంతో ఇంకేం ప్రశ్నలు వెయ్యలేదు. భార్యకి తెల్సిందా లేదా అన్నది అతనికి ఓ పెద్ద సస్పెన్సుఅయి కూచుంది. తెలిస్తే ఎందుకడగకుండా ఊరుకుంది అన్నది ఇంకా పెద్ద సస్పెన్సు! అసలు సంగతి ఎలా రాబట్టడం అన్నది ఒక సమస్య అయింది.

* * *

ఆ రోజు ప్రభావతి వస్తూనే స్నేహితురాలిమీద విరుచుకుపడింది. "నీ కసలు బుద్ధుందా?" అంటూ దండయాత్రకి నాందిగా మొదలుపెట్టింది. "నీ మొగుడనేవాడు అసలు ఏం చేస్తున్నాడో నీకసలు తెలుస్తూందా...." తెల్లబోయి చూస్తున్న సుమతిని- "ఏమిటా వెర్రిచూపు. నిన్ను వెర్రిదాన్నిచేసి నీ మొగుడు నీ వెనక ఏం ఆటలు ఆడుతున్నాడో తెలుసా?" ఆవేశంగా అంది.

సుమతి ప్రభావతి ఆవేశానికి కారణం అర్థం అయి చిన్నగా నవ్వింది. "ఏం చేస్తున్నారు....అమ్మాయిలతో తిరుగుతున్నారు-అవునా...." ఈ సారి తెల్లబోవడం ప్రభావతి వంతయింది.

"అంటే తెలిసీ ఊరుకుంటున్నావా....నీకిదంతా తెలుసా" నమ్మలేనట్లడిగింది.

"అంతా అంటే ఎంతో నాకు తెలియదు. కానీ, ఏదో వుందని తెలియనంత వెర్రిదాన్ని కాదులే....ఆ మధ్య ఆయన ఆఫీసులో పనిచేసే టైపిస్టు అమ్మాయి

సరళ కూరలమార్కెట్‌లో కన్పించింది....పాపం ఆ అమ్మాయితో నాతో ఏదేదో చెప్పాలనుకుని చెబితే ఏం అనుకుంటానని, చెప్పకుండా వుండలేక సతమత మయింది.

"ఏం చెప్పింది ?" కుతూహలంగాచూసింది ప్రభావతి.

"మేడమ్....మిమ్మల్ని .... మీతో పెద్ద పరిచయంలేదు .... మిమ్మల్ని ఆ పద్మావతి గారింట్లో పేరంటంలో చూశాను. మా బాస్ మిసెస్ అని తెలుసు అంటూ పరిచయం చేసుకుంది. "నేను మీకు ఎలా చెప్పాలో, చెప్పడం తప్పో ఒప్పో. అందువల్ల మా బాస్ కోపం ఎదుర్కోవాలని తెల్సినా తోటి ఆడదానికి అన్యాయం జరుగుతూంటే, అందులో మహాలక్ష్మిలా వున్న మిమ్మల్నిచూసి ఆగలేక చెప్తున్నాను—మీ వారిని జాగ్రత్త పెట్టుకోండి .... పూర్తిగా చేజారిపోకముందే మేల్కొండి....నేనూ ఒకరికి భార్యని. నా భర్తే ఇలా చేస్తే అన్న ఆలోచనతో ఇదంతా చెప్తున్నాను. ఆయన జయలక్ష్మి అనే అమ్మాయితో చాలా క్లోజ్‌గా... చాలా దూరం వెళ్తున్నారు ఇద్దరూ...."అంటూ చెప్పలేకచెప్పింది పాపం ఆ అమ్మాయి."

"చెప్పాక కూడా ఇలా చూస్తూ ఊరుకున్నావా....అసలా అమ్మాయి ఎవరట? నీకేమన్నా తెలుసా. ఇవాళ సినిమా హాలనికూడా లేకుండా వాళ్ళ ఇకఇకలు పక పకలు. ఒకరిమీద ఒకరు వాలిపోవడాలు....ఛ - ఛ. ఏదో కాలేజీ కుర్రాడిలా.... నలభై ఏళ్ళు వచ్చి ఇద్దరు పిల్లల తండ్రి అయివుండి, ఎంత లేకిగా....ఛీ....ఛీ" ప్రభావతి జుగుప్సగా అంది. "అదెవర్తే....ఇలా పెళ్ళయినవాడని తెలీదా దానికి?"

"జయలక్ష్మిట. అందంగానే వుంటుంది గాబోలు. ఎమ్.కామ్. చదివిందిట. ఈయనకి పర్సనల్ అసిస్టెంటట. పెళ్లి కాలేదు. పాతికేళ్ల వరువంగల అమ్మాయి కనబడగానే, ఈయనలో సెకండ్ యవ్వనం విజృంభించేసి వుంటుంది. ఈయనగారి తళుకు బెళుకులు, పెద్ద హోదా, కారుగట్రా చూసి ఆ అమ్మాయి ఈయన మాటలకి బోల్తాపడినట్లుంది"

"ఇన్ని తెలిసి కూడా....నిలేసి ముఖం కొల్చకుండా ఊరుకున్నావా, పైగా పెద్ద పతివ్రతలా మొగుడిగారి ప్రేమాయణం గురించి కూల్‌గా చెప్తున్నావా...." ప్రభావతిలో కోపంకంటే ఆశ్చర్యం కనబడింది.

సుమతి అదోలా నవ్వింది. "ఏం అని అడగమంటావు. అడిగాననుకో. ముందు లేదని బుకాయిస్తారు. వీళ్ల మాటలు, వాళ్ల మాటలు విని నన్నే అనుమాని స్తున్నావా అంటారు. ఇంకా గట్టిగా నిలేస్తే తెగించి నా ఇష్టం అంటారనుకో.... అప్పుడు దానికి నా దగ్గిరేం జవాబుంది...." సుమతి ప్రభావతి వంక సూటిగాచూస్తూ అంది జవాబు చెప్పమన్నట్టుగా.

"నా ఇష్టం అంటే చెల్లి పోతుందా....పెళ్లయి పెళ్లాం వున్నవాడు తనిష్టం వచ్చినట్టు తిరుగుతూంటే చచ్చినట్టు నోరు మూసుకోవాలా....అలా పడి వుండడానికి నీవేం పాతకాలం ఆడదానివా....అలా తిరిగే హక్కు నీకేం లేదని చెప్పలేవా?"

"ప్రభా....పాతకాలం ఆడదయినా కొత్తకాలం ఆడదయినా....ఓ మొగుడు. ఓ మగమహారాజు నా ఇష్టం అంటే....భార్యకి రెండే త్రోవలున్నాయి—ఒకటి-వేరే దారి లేకపోతే చచ్చినట్లు సహించి పడుండడం. రెండు-తెగించి మొగుడ్ని వదిలి పోవడం-ఈ రెండింటిలో ఏది చెయ్యమంటావు నన్ను?"

"మొగుడ్ని వదిలిపోవడం నీకేం ఖర్మ....ఉండి అతనికి పట్టిన తీట వదిలించాలిగాని" కోపంగా అంది ప్రభావతి.

"అదే....ఎలా అంటావు....?"

"ఎలాగేమిటి, నీ తిరుగుళ్లు చూస్తూ ఊరుకోను అని వార్నింగ్ ఇవ్వాలి"

"ఇస్తాను, అరుస్తాను, అలుగుతాను, తిడ్తాను - ఏడుస్తాను... వీటివల్ల నేనేదన్నా సాధించగలుగుతాననంటావా-నేను తిట్టినకొద్దీ ఆయనకి నా పట్ల కోపం, ద్వేషం పెరుగుతుంది. అటుపక్క మోజు మరింత పెరుగుతుంది. పెళ్లాం రాక్షసిలాగ, ప్రియురాలు ప్రేమమూర్తిలా కనపడి మరింతగా అటు ఆకర్షితులౌతారు.

ఇంకా నేను అరుస్తూ వుంటే, ఉంటే వుండు పోతే పో అనచ్చు. అప్పుడు నా సంగతి ఏమిటి? నాకున్న ఈ డిగ్రీతో ఈ పిల్లలని పోషించి, చదువులు చెప్పించి ప్రయోజకులని చేయగలనా – అటు మావాళ్లు నన్నేకాక నా పిల్లలని ఆదుకునేంత గొప్పవాళ్లేం కాదు. ఇన్నాళ్లూ నేను, పిల్లలూ అందరం ఓ స్థాయికి అలవాటుపడ్డాం. పిల్లలు ఈ సుఖాలకి దూరమై, నేను తెచ్చే వెయ్యో, రెండు వేలతో సరిపెట్టుకుని బతకడానికి ఒప్పుకుంటారా? తండ్రిని దూరం చేసినందుకు ఇంకాస్త పెద్దయ్యాక నన్ను క్షమిస్తారా. ఎదిగీ ఎదగని ఈ పిల్లలని పెట్టుకుని నేను ఒంటరిగా బతకగలనా! నాకా ధైర్యం వుందా? పోనీ పిల్లలని వదిలిపోతే నేను వుండగలనా? ఆవేశంలో పెట్టె సర్దుకు వెళ్లిపోవడానికి, మిషను కుట్టి పిల్లలని పోషించడానికి ఇది సినిమానా! ఒకసారిగనక నేను ఇల్లు వదిలి బతకలేక మళ్లీ వస్తే మరింత లోకువవనా?"

"అంటే, నీ భర్త ఆఫీసరు హోదా, బంగళా, కారు కోసం అన్నీ తెలిసి కూడా సహించిపడుంటావా....అంతకి దిగజారి సర్దుకు బతుకుతానంటావా"

"ప్రభా! కోపం తెచ్చుకోకుండా ఆలోచించు. భార్యగా ఆయన ఈ ప్రవర్తన నాకు బాధ కలిగించడంలేదనా నీ ఉద్దేశం. కట్టుకున్న మొగుడు ఇంకో ఆడదాని ఆకర్షణలో పడితే ఆ అవమానం, హింస నాకు లేదంటావా? ఈ పిల్లలు గనక లేక పోతే ఇల్లు కదలడానికి అరక్షణం ఆలోచించేదాన్నికాదేమో. ప్రభా ఆయన్ని ఎదిరించి బతికే ధైర్యం, అవకాశం నాకు లేనప్పుడు బయటపడి ఆయనచేత మాటలు పడేకంటే తెలియనట్లు ఊరుకుంటే ఆయన గిల్టీ ఫీలింగు ఆయన్ని తినేస్తుంది. ఈ పైపై వ్యామోహాలు ఎన్నాళ్లుంటాయి అంటావు? కొత్త బొమ్మ చేతికొస్తే ముందు రోజు విడవకుండా ఆడతారు పిల్లలు. మర్నాటినించి దాని ముఖం చూడరు. ఈ మగాళ్లు అంతే, అందనంతవరకే ఆరాటం. ఈ దొంగచాటు వ్యవహారాల థ్రిల్ అంతా అందేవరకు...."

"ఏమిటే నీ వాదన? ఆయనగారు మోజు తీరి ఎలాగో మళ్లీ నీ దగ్గరకే స్తాడు. నాలుగు రోజులు కళ్లు మూసుకుంటే సరిపోతుందంటావా....ఛీ....ఛీ.... శాస్త్రో కూస్త్రో చదువుకున్న మనం కూడా అలా ఆలోచించబట్టే మన గతి ఇలా వుంది. పెద్ద సతీసుమతివి. వెళ్లు మొగుడ్ని ఆవిడ ఇంటికి తీసికెళ్లి అప్పగించు...." ప్రభావతి కోపంగా లేచిపోయింది.

"దాని ఇంటికి ఎందుకు. ఆవిడనే ఇక్కడికి రమ్మందామనుకుంటున్నాను" చిలిపిగా నవ్వింది. "ఈ దొంగచాటు ఎందుకు....ఇంటికే తెచ్చుకుంటే సరిపోతుంది అని చెపుతాను"

ప్రభావతి నోరెళ్లబెట్టింది. సుమతి నవ్వుతూ ఆ నోరు మూసి—"నాకేం మతి పోలేదే....ఇప్పుడింక నీ నోరు విప్పకు. ఇంకో వారం తరువాత మాట్లాడుదువుగాని నేను చేసింది చూశాక" అంది.

* * *

"చూరాదండి....మీ పేరు జయ కదూ. నేను మిసెస్ రమేష్‌ని. అంటే మీ బాస్‌గారి భార్యను" రూములో పుస్తకం చదువుతున్న జయ గాభరాగా లేచింది. "పరవాలేదు ఏం భయపడకు. నిన్నేం తిట్టడానికో, కొట్టడానికో రాలేదు. అలా చెమటలు పడ్తున్నాయేమిటి? ముందు కూర్చో. మనం సావకాశంగా మాట్లాడుకుందాం.

నువ్వు నాకెలా తెలుసా అన్నది, నీ ఇల్లెలా తెల్సింది లాంటి చిన్న ప్రశ్నలొద్దు. సూటిగా పాయింట్ మాట్లాడుకుందాం" సుమతి తను కూర్చుని బిత్తర పోయి చూస్తున్న జయ చెయ్యి పట్టుకు కూర్చోబెట్టింది చనువుగా.

"చూడమ్మా, నీవు నాకంటే చిన్నదానివి. నన్ను నీ అక్క అనుకో. ఇప్పుడు చెప్పేదంతా నీ మంచి కోసం అన్నది అర్థంచేసుకో. నీకు....మావారికి మధ్య జరుగుతున్నది నాకు తెలియదనుకోకు. ఇలాంటి విషయాలు ఎన్నాళ్లో దాగవు. చూడు జయా! నీవు పెళ్లి కావాల్సినదానివి. ఇలా పెళ్లయిన మగాడితో సంబంధం పెట్టుకునేముందు ఒక్కక్షణం ఆలోచించావా? ఈయన నిన్నేమన్నా పెళ్లి చేసుకుంటా నన్నారా? అని వుండరు.

ఎందుకంటే ఈ మగాళ్లకి చాటుగా ఓ ఆడదానితో తిరిగి రొమాన్సు జర పడం ఓ థ్రిల్లుగానీ, పెళ్లాం వుండగా మరొకత్తెని తెచ్చిపెట్టుకుని పెళ్లాడే దమ్ము లుండవు. వాళ్ల పరువు ప్రతిష్ఠలతో పాటు భార్య, పిల్లలు సంసారం ఏదీ వదల డానికిష్టపడరు. ఈ రెండో ఆడది ఓ డ్రింక్‌లాగానో, ఓ పేకాటలాగానో పాస్ టైముకో, థ్రిల్‌కో, కిక్కుకో కావాలి వాళ్లకి. ఆయనకి భార్యాపిల్లలున్నారని తెలిసే ఆయనతో సంబంధం పెట్టుకున్నావనుకుంటున్నాను" సుమతి జయ కళ్లలోకి సూటిగా చూసి అడిగింది. అప్పటికే జయ బాగా చెదిరిపోయింది. సిగ్గుతో, అవమానంతో చితికిపోతూ, హఠాత్తుగా అలా రమేష్ భార్య వచ్చి అలా నిలేస్తుంటే ఏం చెప్పాలో తెలియక కళ్లనీళ్ల పర్యంతం అయిపోయింది.

"పిచ్చిపిల్లా, నీ స్థితి నాకర్థం అయింది. ఆయన స్మార్ట్‌నెస్, ఆయన హోదా అంతస్తు చూసి, ఆయన వల్లించిన కల్లబొల్లి ప్రేమకబుర్లకి మెత్తపడిపోయావు. ఉద్యోగం నీ అవసరం. బాస్‌ని ఇంప్రెస్ చెయ్యాలన్న ఆరాటంతో నీ లిమిట్స్ మర్చిపోయావు. ఈ ఇంటిమెసీ పెళ్లికి దారితీయదని తెల్సినా జరిగినన్నాళ్లూ జరగనీ అనుకుని దానివల్ల వచ్చే లబ్ధి పొందాలనుకున్నావు. నీవు ఒంటరిగా ఈ ఊర్లో ఉండడం, పెద్దవాళ్లు దగ్గర లేకపోవడం, ఈ రోజుల్లో దొరికే ఫామిలీ ప్లానింగ్‌లు అందుబాటులో వుండడంతో భయపడ్డానికి ఏమీలేదని స్వేచ్ఛగా తిరిగావు. అంతేనా"

జయ తల దించుకుంది. కళ్లమ్మట నీరు కారసాగింది. నల్లబడ్డ ముఖం పైకి ఎత్తి ప్రాధేయపూర్వకంగా సుమతివంక చూసింది. "క్షమించండి....ప్లీజ్....పొర పాటయింది....ఇంత దూరం ఆలోచించలేదు నేను....ఇంక నేను...." వణుకుతున్న గొంతుతో ఏదో అనబోయింది.

"నా మొగుణ్ని వదిలేయి. నాకు పతిభిక్ష పెట్టు. నా కాపురం నిలబెట్టు అని అడగడానికి వచ్చాననుకుంటున్నావా? నా మొగుణ్ని కలవద్దు అని ఆంక్షలు పెట్ట డానికి రాలేదు జయా"

జయ తెల్లబోతూ చూసింది.

"నీవు, ఆయన ఇలా దొంగచాటుగా తిరగడం ఎందుకు? తిన్నగా మా ఇంటికే వచ్చేసి అక్కడే వుండువుగాని అని నీకు చెప్పి తీసుకు వెళదామని వచ్చాను"

"సుమతిగారూ" జయ భోరుమంది. "ప్లీజ్ సుమతిగారూ! నన్ను క్షమించండి. ఇదంతా నేను కావాలని చెయ్యలేదు. మీ కాపురం పాడుచెయ్యాలని ఎప్పుడూ అనుకోలేదు. ఏమిటో నాకు తెలియకుండానే ఇన్వాల్వ్ అయిపోయాను. ఆయన బాస్. ఇంప్రెస్ చెయ్యాలన్న ఆరాటంలో ఆ ఆకర్షణనించి తప్పించుకోలేకపోయాను.... అసలే సిగ్గుతో చితికిపోతున్నాను. ఇంకా మీ ఔదార్యంతో, దయతో నన్ను చంపకండి. ప్లీజ్, తిట్టండి. కొట్టండి చెప్పుతో బుద్ధి వచ్చేట్లు" అంటూ ఏడవడం ఆరంభించింది జయ.

"ఇంక ఆయన ముఖం చూడను. ఐ ప్రామిస్. ఆయన్ని కలవను, మాట్లాడను" జయ ఆవేశంగా అంది. సుమతి నవ్వింది.

"దాంతో ఈ ప్రాబ్లెమ్ సాల్వ్ అవదు జయా! నేను నీ దగ్గరకి వచ్చి నానా మాటలు అని మీ ఇద్దరినీ విడదీశానని నామీద కక్ష పెంచుకుని, నీమీద సానుభూతితో నీకు మరింత దగ్గరౌతారు తప్ప ఏం లాభం? జయా నీవు నిజంగా పశ్చాత్తాపపడుతూంటే, చేసిన తప్పు సరిదిద్దుకోవాలంటే నాతో సహకరించాలి"

"చెప్పండి....మీరేం చెప్పినా చేస్తాను"

"చూడమ్మా! ఏ వస్తువైనా మనకు అందనప్పుడే అది కావాలనిపిస్తుంది. అందగానే ఏ విలువా కనపడదు. మగాడికి ఆడదీ అంతే! నీతో ఇలా దొంగచాటు రొమాన్సు ఆయనకి థ్రిల్లు ఇస్తుంది. అదే నీవు మా ఇంటికి వచ్చి ఆయనతో వుంటే పది రోజుల్లో నీమీద ముఖం మొత్తుతుంది. నీ మీద ఎంత ప్రేమ, ఆసక్తి వుందో నీకే అర్థం అవుతుంది. తొందరపడి నీవు ఆయనని ఎలా నమ్మావో నీకే తెలుస్తుంది. ఆయన అసలు రూపు నీకే తెలుస్తుంది.

ఇదంతా నేను నా కోసం కాదు నీ కోసం చేస్తున్నాను. ఈ విషయంలో నాకేట్టే నష్టం జరగదు. నాలుగు రోజులు నీతో తిరిగి ముఖం మొత్తి నా దగ్గరకే వస్తాడు. భార్యగా సంఘంలో, ఆ ఇంట్లో నా స్థానం చెక్కుచెదరదు. నాలుగు రోజులు సహిస్తే నా సమస్య సమసిపోతుంది. కానీ నీలాంటి చదువుకున్న అమ్మాయిలు. నాలాంటి ఇల్లాళ్ళు కలిసి ఈ మగాళ్ళకిబుద్ధి చెప్పాలి. ఆడదానికి ఆడదే శత్రువు కాబట్టి మగాళ్ళ ఆట చెల్లుతుంది. వాళ్ళేదో చేశారని అనే ముందు తోటి ఆడాదనికి శత్రువవకూడదు"

జయ కళ్ళు తుడుచుకుంది. మెచ్చుకోలుగా చూసి "చెప్పండి, నన్నేం చెయ్యమంటారో" అంది. సుమతి మరో పావుగంట కూర్చుని జయతో మాట్లాడింది.

* * *

"ఇప్పుడు చెప్పు ప్రభా! నేనింకా నీ కళ్ళకి తెలివితక్కువ మొద్దులాగానే కనపడుతున్నావా" సుమతి చిలిపిగా నవ్వింది.

ప్రభావతి మరోసారి నోరెళ్ళబెట్టింది. "ఏం చేశావే. ఎలా చేశావ్ చెప్పు" ఆరాటంగా అడిగింది.

"చెప్పడానికి ఏముంది వెరీ సింపుల్. ఇదివరకు చెప్పాను చూడు-చిన్న పిల్లాడు—కొత్త బొమ్మ....ఆ సూత్రం అప్లై చేశాను. జయని ఇంటికి తీసుకురాగానే ఆయన ముఖం చూడాలి. ఆ గాభరా, భయం చూడాలి. అంత మానవుడూ నీళ్ళు కారిపోయారు. "దొంగచాటు కర్మ మీకెందుకు? నలుగురి నోళ్ళల్లో పడకుండా ఇంట్లోనే సాగించండి" అనగానే దిమ్మెరపోయారు.

నామీద ఎగిరారు. జయని తిట్టారు నీకెలా బుద్ధి, సిగ్గులేకుండా వచ్చావని. "ఆ అమ్మాయిని అలా వాడుకుని వదిలేస్తే ఊరుకోనని, జరిగిందేదో జరిగింది ఆమె మెళ్ళో తాళి కట్టండి. ఇద్దరం కల్సివుంటాం" అనగానే చూడాలి ఆయన ముఖం-గదిలో కాళ్ళు పట్టుకున్నంతపని చేశారు.

"జనం ముఖంమ్మీద ఉమ్మేస్తారు. నా పరువు ఏం కావాలి? నీకిదేం బుద్ధి? పెద్ద పతివ్రతననుకుని మొగుడికి రెండో పెళ్ళి చేస్తావా...."అంటూ ఆయన గోల చూడాలి. నేను జయని అలంకరించి గదిలోకి పంపితే గదిలో పాము వున్నట్టు బయటికి పరిగెత్తారు. వారం రోజుల్లో మానవుడు పిచ్చెత్తిపోయాడు. కంటికి నిద్ర, తిండి లేక మనిషి సగం అయిపోయారు. అటు జయ, ఇటు నా ముఖం చూడలేక, గదిలోంచి బయటికి రాక మనిషి సిగ్గుతో చితికిపోయారు. ఆఖరికి నన్ను కౌగలించుకుని ఏడిచే కారు అంత మగాడు. జయ వెళ్ళేవరకు పిచ్చెత్తిన వారిలా అయిపోయారనుకో"-సుమతి నవ్వింది.

"భలేదానివే, ఎంత తెలివే నీకు? నిన్నేదో పిచ్చి మొహం అనుకున్నాను."

-ప్రభావతి అంది మనస్ఫూర్తిగా స్నేహితు రాలిని మెచ్చుకుంటూ.

(స్వాతి)

★